క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో అప్పలనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం విజయనగరానికి చెందిన పి. వెంకట శోభాచల పతిరావు,విజయభారతి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో దేవస్థానం తరపున పీఆర్వో అప్పలనాయుడు దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి సాంబ పాల్గొన్నారు.

11న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సబ్బవరం: మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఈ నెల 11న సబ్బవరంలో నిర్వహిస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.మండలంలోని సబ్బవరం,అంతకాపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక(సీజీఆర్‌ఎఫ్) చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి. సత్యనారాయణ అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు.సబ్బవరం సబ్ స్టేషన్ వద్ద 11వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో వినియోగదారులు అర్జీలు, ఫిర్యాదులు అందజేయవచ్చునని సూచించారు.

పాల సొసైటీ అధ్యక్షుడిగా రమణబాబు



రమణబాబును సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

సబ్బవరం: అమృతపురం పాలసొసైటీ నూతన అధ్యక్షుడిగా గండి రమణబాబు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడితో పాటు నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను గ్రామ పెద్దలతో పాటు పాల ఉత్పత్తిదారులు ఘనంగా సత్కరించారు. రమణబాబు మాట్లాడుతూ పాలసొసైటీని అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పాలకవర్గాన్ని సత్కరించిన వారిలో మాజీ సర్పంచ్ గండి ముత్యాలనాయుడుతో పలువురు గ్రామ పెద్దలు ఉన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. నగరంలోని శ్యామల కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యాలతో అలరించారు. గణపతి స్తుతి గీతానికి చేసిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా కళాకారులు దీక్షిత ,స్నిగ్ధ ప్రమిదలో వెలిగించిన నృత్యాభినయాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచాయి.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097
సాక్షి

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. అప్పన్నను దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. మరో వైపు సింహాచలేశుడికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయకల్యాణమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శత నామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని సాయి నగర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ ఇండుగుబిల్లి గోపి అధ్యక్షతన మండల అధ్యక్షుడు బొర్రా జయరాజ్ మాదిగ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సబ్బవరం మూడు రోడ్లు కూడలి వరకూ మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా మాదిగ పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గొటివాడ సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో కొద్దిపాటి యువకులతో స్థాపించిన ఎమ్మార్పీఎస్ ఈ రోజు ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు జాతీయ స్థాయిలో ఉద్యమించే పోరాట సంస్థగా కొనసాగుతుందన్నారు.అనంతరం 30 ఏళ్ల నుంచి ఉద్యమంలో ఉన్న సీనియర్ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు నీటిపల్లి ముత్యాలరావు, నాయకులు దువ్వి దుర్గాలు,గొటివాడ సన్యాసి,ఇండుగుబిల్లి పరదేశి, కొమ్ము కోటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు

అగనంపూడి: పాడేరు నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు బస్సులో గంజాయి తరలిస్తున్న మహిళను దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన చిలకమ్మ నాలుగు ప్లాస్టిక్ కవర్లతో 8 కిలోల గంజాయిని సబ్బవరం మీదుగా బస్సులో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో దువ్వాడ నాగదేవత కొండ వద్ద పోలీసులు మాటువేసి బస్సులో తరలిస్తున్న గంజాయి సంచులను స్వాధీనం చేసుకొని చిలకమ్మను అరెస్టు చేశారు.

ఉత్సాహంగా ప్రోమోరన్



ప్రోమో రన్‌లో పాల్గొన్న నేవీ సిబ్బంది, రన్నర్లు



ఆర్కే బీచ్‌లో ప్రోమో రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జైషి హతంగడి

సింధియా: త్వరలో నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్‌కు సన్నాహకంగా ఆదివారం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ప్రోమోరన్‌ను ఐఎన్ఎస్ కళింగ, వైలెన్స్ ట్రీట్ రిస్క్ అసెస్‌మెంట్, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సెంటర్ల సహకారంతో ఆర్కే బీచ్‌లో నిర్వహించారు. 9వ ఎడిషన్ డిసెంబర్ 15న నిర్వహించనున్నారు. రన్నర్లు, ఇండియన్ నేవీ సిబ్బంది శారీరక సౌష్టవంతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహించిన ప్రోమోరన్‌ను హెరిటేజ్ వ్యాఖ్యాత జైషి హతంగడి జెండా ఊపి ప్రారంభించారు. రన్‌లో సుమారు 600 మంది నేవీ సిబ్బంది, రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వారాహికి కుంకుమ పూజలు



లలితా పీఠంలో వారాహి అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న అర్చకుడు

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చన చేశారు. వారాహి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అనాస పండ్లు నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్స్ కార్యక్రమం హాస్యం పండించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. వాటిలో తాత మనవడు మావ, గొట్టం గాడు, బ్యాంకు లోన్, అమలాపురం బస్సు, పిల్లిని చంపితే, సౌండ్ పార్టీ, జనాభా లెక్కలు, మిమ్మలనే ఫాలో అవుతున్నా, డాక్టర్ అలా చెప్పాడా స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, రామానుజం, సూర్యం, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, మల్లిక, నాగ గణేష్, సీతాగణేష్, భవాని, నాగరాజు అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. కార్యక్రమంలో అతిథులు నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, బాదంగీర్ సాయి, డి.జె.నాగరాజు, బొబ్బాది అప్పారావు కళాకారులను సత్కరించి అభినందించారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ
సంస్థగానే కొనసాగించాలి



మాట్లాడుతున్న ఇంటక్ నాయకుడు భాస్కరరావు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేసి పూర్వ వైభవానికి సహకారం అందివ్వాలని విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘం (ఇంటక్) ప్రధాన కార్యదర్శి పి.భాస్కరరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 1242వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు...సెయిల్‌లో విలీనమే శరణ్యమన్నారు. ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వబోమన్నారు. కార్యక్రమంలో పీవీ నగేష్, వంశీకృష్ణ, సుబ్బయ్య, జి.నాగిరెడ్డి, బైరెడ్డి, కె.రమణ, రామారావు తదితరులు మాట్లాడారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

సీతంపేట: సమాజంలో బ్రాహ్మణుల మనుగడకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని వివిధ వర్గాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు పిలుపునిచ్చారు. వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యువ రాజకీయ వేత్త ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ సమాజంలో అందరూ బాగుండాలని కోరుకునే వారిలో మొదటి వారు బ్రాహ్మణులేనని, అలాంటి వారు నేడు దుర్భర స్థితిలో ఉన్నారన్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా, వ్యాపార రంగాల్లో బ్రాహ్మణుల ఎదుగుదలకు అవరోధం కలిగించే శక్తులు ఎన్నో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. న్యాయవాది కె.వి.నరసింహమూర్తి మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ భవన్‌కు కొంత స్థలాన్ని కేటాయించగా.. దానికి కంచె వేశామన్నారు. బ్రాహ్మణ సంఘాల పేరిట ఇవ్వాల్సిన ఆ స్థలాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్, దేవదాయ శాఖ సంయుక్త పేరిట ఇవ్వడంతో దానికి క్లియరెన్స్‌లో జాప్యం జరిగిందని చెప్పారు. ఏపీ బ్రాహ్మణ ఐక్య వేదిక కన్వీనర్ సీవీఎస్ సాయిరామ్, వైద్యులు విజయశేఖర్, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్, సంస్థ గౌరవాధ్యక్షులు టీఎస్సార్ ప్రసాద్, వివిధ సంఘాల ప్రతినిధులు నెమ్మలూరి శివగణేష, దివాకర్, హనుమంతరావు, మహంతి, డాక్టర్ వాణి తదితరులు భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ఏయూ మెస్‌ల ఆకస్మిక తనిఖీ



మెస్‌లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల మెస్‌లను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల, రీసెర్చ్ స్కాలర్స్, మహారాణిపేటలోని విద్యార్థినుల మెస్‌లను పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత, ఆహార పదార్థాల రుచి, నాణ్యత వంటివి ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెస్‌లలో సిబ్బంది ప్రవర్తన, పనితీరు, భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మెస్‌లలో పలు మార్పులు చేయాలని కోరారు. వాటికి త్వరలో పరిష్కారం చూపుతామని రిజిస్ట్రార్ హామీ ఇచ్చారు. తరచూ మెస్‌లను తనిఖీ చేస్తామని, నాణ్యతలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. మెస్‌లలో పని చేస్తున్న సిబ్బందితో నేరుగా మాట్లాడారు. రుచిగా, శుచిగా భోజనం అందించడానికి కృషి చేయాలని సూచించారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన రేషన్ లారీ

తప్పిన పెను ప్రమాదం



అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలో సూరెడ్డిపాలెం బ్రిడ్జి డివైడర్‌పై చిక్కుకొన్న రేషన్ లారీ

సబ్బవరం: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై మండలంలోని సూరెడ్డిపాలెం జంక్షన్ వద్ద ఆదివారం లారీ అదుపు తప్పి బ్రిడ్జి డివైడర్‌పైకి దూసుకు పోయింది.అదృష్టవశాత్తు లారీ డివైడర్‌పై చిక్కుకుపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. వివరాలు.. పశ్చిమ బెంగాళ్ నుంచి శనివారం బియ్యం లోడుతో కేరళకు లారీ బయలుదేరి వెళ్తుంది.ఆదివారం తెల్లవారుజామున సూరెడ్డిపాలెం వచ్చే సరికి గుజరాత్‌కు చెందిన డ్రైవర్ ఉజ్జల్ పగ్రే నిద్ర మత్తులోకి జారుకోవడంతో బ్రిడ్జి డివైడర్ పైకి లారీ దూసుకుపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని మొబైల్ హైవే పోలీస్‌లు తెలిపారు.బ్రిడ్జి డివైడర్ నుంచి లారీ కిందపడితే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. డ్రైవర్‌తో పాటు క్లీనర్ హనిమస్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

40 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువత

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన దివంగత మాసవరపు సన్నిబాబు జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు మరిన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. వైద్య శిబిరాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సందర్శించి నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. శిబిరంలో కంటి పరీక్షలు, క్యాన్సర్, గర్భిణులు, స్త్రీలు, షుగర్, బీపీ, థైరాయిడ్, కొలస్ట్రాల్, గుండెకు సంబంధించిన సమస్యలపై ప్రముఖ వైద్య నిపుణుల బృందం శ్రీదేవి, భానుకిరణ్, స్వర్ణ, రమేష్, చతుర్వేది, పూజిత, సహస్ర, యుగంధర్, మంజూ, కృష్ణ ప్రసాద్, గుండా సుధీర్, దివ్య పరీక్షించారు. 845 మంది రోగులకు వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూంద్రపు శ్రీరామ్మూర్తి, నాయకులు సన్నిదేముడు, సన్యాసప్పారావు, ఉప సర్పంచ్ కె.సత్యనారాయణ, మాసవరపు సురేష్, చెల్లయ్యమ్మ, లక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

బడి బాగుకు...

ఏక తాటిపైకి పూర్వ విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో మాట్లాడుతున్న వైఎన్ ప్రసాద్

గోపాలపట్నం: తమ చదువుల కోవెల బాగు కోసం పూర్వ విద్యార్థులు ఏకమయ్యారు. అందుకు తగిన కార్యాచరణ రూపొందించారు. విద్యార్థులంతా కలిసి సంఘంగా ఏర్పడి పాఠశాలను అందరి సాయంతో అభివృద్ధి చేయాలని తీర్మానించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఇక్కడి బాలికల పాఠశాలలో సమావేశమయ్యారు. పాఠశాల ప్రారంభం 1963 నాటి నుంచి 2024 వరకు చదివిన పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు చాలా మంది హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధికి ఏవిధంగా తోడ్పాటునందిద్దామన్న పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు బ్యాంక్ ఖాతా ప్రారంభించి నిధులు సేకరించనున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా మజ్జూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా వైఎన్ ప్రసాద్, కోశాధికారిగా సదరం శ్రీనాథ్, సంయుక్త కోశాధికారిగా కోనేటి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లుగా మహ్మద్ ఖలీల్ ఉర్ రహమాన్, కోల్కొండ శ్రీనివాసరావు, మేడిది రాజశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా కొయిలాడ వెంకటజగన్, శ్రీకుమార్, అల్లం రమేష్, న్యాయ సలహాదారుగా టి. సుగుణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వీరంతా పాఠశాల అభివృద్ధికి నిజాయితీగా కృషి చేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గణితంలో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి



సరోజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డీఈవో చంద్రకళ, ఆర్జేడీ విజయ్ భాస్కర్

పెదగంట్యాడ: గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా తయారు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో గోపాలపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత పోటీలలో మండలంలోని యారాడ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సరోజ్ కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయనను డీఈవో చంద్రకళ, ఆర్జేడీ విజయ్ భాస్కర్ సత్కరించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ చతుర్విధ ప్రక్రియలు విద్యార్థులకు సులభమ్యే విధంగా బోధన సాగించాలన్నారు. పోటీ పరీక్షల్లో సైతం గణిత ప్రశ్నలకు చకచకా సమాధానాలు రాసేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయులను మరింతగా ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com